సాక్షి ప్రకాశం
సోమవారం। 11। సెప్టెంబర్। 2023



ఉపకార వేతనం అందిపుచ్చుకోండి

నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పథకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులకు ఈనెల 19వ తేదీ తుది గడువు.

- 8లో..



అమరజవాన్ల త్యాగం మరువలేం

అమరజవాన్ల త్యాగాలు మరువలేమని ఎమ్మెల్యే అన్నా రాంబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి అన్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
35/29

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కోర్టు తీర్పును అందరూ గౌరవించాలి

- ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవు
- ఎస్పీ మలికా గర్గ్



ఒంగోలు టౌన్: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టయిన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు 14 రోజులపాటు రిమాండ్ విధిస్తూ ఏసీబీ కోర్టు ఇచ్చిన తీర్పును అందరూ గౌరవించాలని ఎస్పీ మలికా గర్గ్ చెప్పారు. కోర్టులో ఆరు గంటలపాటు వాదోపవాదాలు జరిగిన తరువాత న్యాయస్థానం తీర్పు ఇచ్చిందని స్పష్టం చేశారు. కోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ ఎలాంటి నిరసనలు తెలియడానికి వీలులేదని, ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందుకు విరుద్ధంగా ఎవరైనా శాంతి భద్రతలకు ఆటంకం కలిగించినా, ప్రజల సాధారణ జీవనానికి ఇబ్బందులు కలిగించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బలవంతంగా దుకాణాలు మూయించడం, స్కూళ్లు, కాలేజీలు, ఇతర విద్యాసంస్థలను మూయించడం లాంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠినంగా శిక్షిస్తారన్నారు. 30 పోలీసు యాక్ట్ అమలులో ఉందని, చట్టాన్ని ఉల్లఘించడం, పోలీసుల అనుమతి లేకుండా ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. అల్లర్లకు పాల్పడే వారిపై నిరంతర నిఘా కొనసాగుతుందని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. సోమవారం కొందరు తలపెట్టిన బంద్‌తో సాధారణ జనజీవనానికి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసులను ఎస్పీ ఆదేశించారు.

13న గిద్దలూరులో కలెక్టర్ స్పందన

గిద్దలూరు రూరల్: పట్టణంలోని నంద్యాల రోడ్డులోని చీతిరాల కల్యాణ మండపంలో ఈ నెల 13న కలెక్టర్ దినేష్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహశీల్దార్ డి.సీతారామయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

సౌత్‌ఇండియా కరాటేలో మార్కాపురం విద్యార్థుల ప్రతిభ



బహుమతులు సాధించిన విద్యార్థులతో ప్రతినిధులు

మార్కాపురం: కేరళ రాజధాని తిరువనంతపురంలో జిమ్మి జార్జ్ స్పోర్ట్స్ హబ్‌లో నిర్వహించిన సెకండ్ సౌత్‌ఇండియన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో మార్కాపురం పట్టణానికి చెందిన ఎస్ఎస్ స్పోర్ట్స్ కరాటే స్కూల్ విద్యార్థులు గోల్డ్ మెడల్ సాధించినట్లు చీఫ్ ఎగ్జామినర్ ఎం.శ్రీనివాసరెడ్డి ఆదివారం తెలిపారు. ఈ పోటీలకు 6 రాష్ట్రాల నుంచి హాజరుకాగా అండర్ 13 విభాగంలో జస్వంత్‌రెడ్డి గోల్డ్ మెడల్ సాధించగా, ఎస్కే హుస్సేన్‌బాషా రజత పతకం, అండర్ 10 బాలికల కటా విభాగంలో ఎస్కే జోయా సిద్దికి రజత పతకం వచ్చినట్లు తెలిపారు.

ఉత్సాహంగా ముగిసిన ఎంఎంఏ పోటీలు



ఒంగోలు టౌన్: జాతీయ స్థాయి మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలు ఘనంగా ముగిశాయి. జాతీయస్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. థ్రిల్ బేస్ క్యాంప్ డైరక్టర్ డాక్టర్ దీపక్ సాహిత్య కొల్లం, ఝాన్సీ కొల్లం ఆధ్వర్యంలో రాష్ట్రంలో తొలిసారిగా ఒంగోలులో నిర్వహించిన ఎంఎంఏ చాంపియన్‌షిప్ పోటీలకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యారు. ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగిన ఈ పోటీలను ఆసక్తిగా తిలకించారు. ఆదివారం జరిగిన ఫైనల్ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన యువనాయకుడు బాలినేని ప్రణీత్ రెడ్డి విజేతలకు మెడల్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆంధ్రకేసరి పాలక మండలి సభ్యులు టి.సుమతి, ఏఐఎంఎంఏ నేషనల్ కార్యదర్శి అబ్దుల్ మునీర్, నేషనల్ జోనల్ హెడ్ శ్యామ్ ప్రసాద్, తెలంగాణ నేషనల్ అసోసియేట్ సుభాన్, నేషనల్ సభ్యులు స్నిగ్ధ, మీనాకుమారి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ తాటి కృష్ణలత, మహిళా అధ్యక్షురాలు టి.పద్మావతి, టార్గెట్ బేస్ థ్రిల్ క్యాంప్ డైరక్టర్ పాలపర్తి మోహన్ పాల్గొన్నారు.

సర్వత్రా ఉత్కంఠ



- రెండు రోజులుగా చంద్రబాబు వ్యవహారంపై ఆసక్తిగా చూసిన జిల్లా ప్రజలు
- చంద్రబాబుకు రిమాండ్ నేపథ్యంలో నైరాశ్యంలో టీడీపీ శ్రేణులు
- ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్ట బందోబస్తు
- అరెస్టుకు నిరసనగా ప్రజల నుంచి కానరాని స్పందన

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడు నారా చంద్రబాబు నాయుడును సీఐడీ పోలీసులు అరెస్టు చేయడం, కోర్టు రిమాండ్ విధించిన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. విజయవాడ ఏసీబీ కోర్టు చంద్రబాబుకు రిమాండ్ విధించటంతో ప్రజల్లో ఏం జరుగుతుందోనన్న ఆసక్తి నెలకొంది. మొదటి రోజు చంద్రబాబు నంద్యాల నుంచి కాన్వాయ్‌లో జిల్లాలో ప్రయాణించి వెళ్లినప్పుడు ఉన్న ఉత్కంఠ కంటే ఆదివారం ఏసీబీ కోర్టులో సుదీర్ఘంగా వాదనలు సాగుతున్న తీరును టీవీల్లో ఆసక్తిగా చూశారు. ఎప్పటిలాగే కేసులో స్టే తెచ్చుకుంటాడని టీడీపీ నేతలు భావించారు. చివరకు న్యాయమూర్తి రిమాండ్ విధించటంతో చంద్రబాబు అడ్డంగా దొరికిపోయాడని ప్రజలు నిర్ణయానికి రాగా, టీడీపీ నేతలు అవాక్కయ్యారు. మొదటి రోజు శనివారం జిల్లాలో గుండా కాన్వాయ్‌తో తీసుకెళుతుంటే జిల్లాలో అటు ప్రజల నుంచి ఇంటి సొంతపార్టీ టీడీపీ నాయకుల నుంచి స్పందన కరువైంది. 4.20 గంటల పాటు జిల్లాలో చంద్రబాబు కాన్వాయ్ ప్రయాణించింది. దాదాపు 175 కిలో మీటర్లు ప్రయాణించినా చంద్రబాబు కాన్వాయ్‌ను అడ్డుకున్న దాఖలాలు శూన్యం. కర్నూలు జిల్లా నుంచి ప్రకాశం జిల్లాలోని గిద్దలూరు మండలం దిగువమెట్ట గ్రామంలోకి ఉదయం 8.45 గంటలకు చంద్రబాబు కాన్వాయ్ ప్రవేశించింది. అక్కడ నుంచి గిద్దలూరు, మార్కాపురం, సంతనూతలపాడు, ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గాలలో గుండా కాన్వాయ్ బాపట్ల జిల్లాలోకి మధ్యాహ్నం 1.05 గంటలకు ప్రవేశించింది. మొత్తం 175 కిలో మీటర్లు ప్రయాణించిన చంద్రబాబుకు అటు ప్రజల నుంచి కానీ ఇటు ఆయన సొంతపార్టీ టీడీపీ నాయకులు, కార్యకర్తల నుంచి అరెస్టుకు నిరసనలు పెద్దగా కనపడలేదు.

టీడీపీ శ్రేణుల్లో నైరాశ్యం:

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబు అడ్డంగా దొరికిపోయాడని టీడీపీ శ్రేణుల్లోనే నైరాశ్యం నెలకొంది. విజయవాడ సీఐడీ పోలీసులు అరెస్ట్ చేసి జిల్లాలో గుండా ఆయన కాన్వాయ్ వెళుతున్నా పార్టీ నాయకులు కాన్వాయ్‌ను అడ్డుకునే ప్రయత్నం కూడా చేయలేదంటే కుంభకోణం తీవ్రత ఎంతో టీడీపీ నాయకులే అర్థం చేసుకున్నట్లు ఉన్నారు. మొదటి రోజు తూతూ మంత్రంగా చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఆందోళనలు చేపట్టారు. చంద్రబాబు బయటకు వస్తే జిల్లా కేంద్రం ఒంగోలులో ఉత్సవాలు నిర్వహించాలని టీడీపీ నాయకులు భావించారు. అయితే రిమాండ్‌కు పంపడంతో డీలాపడ్డారు. పోలీసులు మాత్రం ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉన్నారు. టీడీపీ శ్రేణులు రోడ్ల మీదకు వచ్చి అల్లర్లు సృష్టించే అవకాశాలు ఉన్నాయని భావించిన ఎస్పీ మలికాగర్గ్ ఒంగోలు నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా పోలీస్ పహారాను ముమ్మరం చేశారు. చంద్రబాబు కాన్వాయ్ జిల్లాలో గుండా ప్రయాణించిన సమయం నుంచి కోర్టు రిమాండ్ విధించే వరకు ప్రకాశం జిల్లా పోలీసులు చూపించిన పనితీరుపై ప్రజలు ప్రశంసిస్తున్నారు.

న్యాయం గెలిచింది



చంద్రబాబు నాయుడిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించటం ద్వారా న్యాయం గెలిచింది. 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో అక్రమాలు జరిగాయి. అందులో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అవినీతి బయట పడటంతో దర్యాప్తు సంస్థలు అన్ని ఆధారాలు సేకరించి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపాయి. రానున్న రోజుల్లో ఇంకా పలు కుంభ కోణాలు వెలుగులోనికి రానున్నాయి. చంద్రబాబు నాయుడు ప్రజా ధనాన్ని ఎలా దుర్వినియోగం చేశాడో అర్థం చేసుకోవాలి. చట్టం ప్రతి ఒక్కరికీ సమానమే.

– కేపీ నాగార్జున రెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే

కుంభకోణంలో ప్రధాన ముద్దాయి చంద్రబాబే



స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో ప్రధాన ముద్దాయి చంద్రబాబే. విద్యార్థులు, ఉద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ పేరుతో భారీ దోపిడీకి పాల్పడ్డారు. జర్మనీకి చెందిన సీమెన్స్ సంస్థకు తెలియకుండా బాబు బృందం దొంగల ముఠాగా ఏర్పడి లోపాయికారి ఒప్పందంతో షెల్ కంపెనీల ద్వారా రూ.371 కోట్ల ప్రజాధనం లూటీ చేశారు. చంద్రబాబుకి పడే శిక్ష తప్పు చేసేవాడు వణికేలా ఉండాలి.

– మద్దిశెట్టి వేణుగోపాల్, దర్శి ఎమ్మెల్యే

ఇది రాజకీయ కక్షకాదు



ప్రజాధనం దోపిడీ చేసినందువల్లే చంద్రబాబును అరెస్టు చేశారు. వ్యవస్థలను మేనేజ్ చేయడం ఎల్లకాలం కుదరదు. చంద్రబాబు గతంలో ఓటుకు నోటు కేసులో నిందితునిగా ఉన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంతోపాటు అమరావతి భూకుంభకోణంలో కూడా చంద్రబాబు పాత్ర ఉంది. చట్టం తన పని తాను చేసుకుపోతుంటే దానిని రాజకీయ కక్షగా టీడీపీ నేతలు ఆరోపించడం మానుకోవాలి. రాజకీయ కక్ష అయితే ఎప్పుడో జరిగేదని, ఈ కేసులో సంవత్సరాల నుంచి విచారణ జరుగుతోంది.

– బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే

ఆధారాలు ఉండటంతోనే రిమాండ్‌కు..



చంద్రబాబు తప్పుచేసినట్లు ఆధారాలు స్పష్టంగా ఉన్నాయి కనుకే కోర్టు రిమాండ్‌కు పంపింది. అంతే తప్ప దీనిని రాజకీయ కక్షగా చూడాల్సిన అవసరం లేదు. లోకేష్ చర్యలు, పవన్ కళ్యాణ హైడ్రామా ప్రజలను రెచ్చగొట్టేలా ఉన్నాయి. ప్రజల సొమ్ము దోపిడీ చేసిన వారిపై కేసులు నమోదు చేయడాన్ని తప్పుపట్టడం సరికాదు. ప్రజల సొమ్ము రూ.371 కోట్లు దోపిడీకి గురైతే ప్రజలు దిగ్భ్రాంతి చెందుతున్నారు. అంతే తప్ప తమ సొత్తు పోయినా ఫర్లేదు అంటూ సానుభూతి పలికేందుకు ఎవరూ సిద్ధంగా లేరు.

– జంకె వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే

న్యాయ వ్యవస్థపై విశ్వాసం పెరిగింది



చంద్రబాబును జైలుకు పంపడంతో న్యాయవ్యవస్థ మీద ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగింది. ప్రజాధనం దిగమింగిన చంద్రబాబు స్కామ్‌ను ఆధారాలతో సహా సేకరించిన అధికారులను అభినందించాలి. వారు సేకరించిన ఆధారాలను న్యాయస్థానం ధ్రువీకరించి చంద్రబాబును జైలుకు పంపడం పై ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల్లో మరింత నమ్మకం ఏర్పడింది. 2 ఎకరాల భూమి కలిగిన చంద్రబాబు నేడు వేల కోట్ల రూపాయలకు ఎలా అధిపతి అయ్యాడో తేటతెల్లమవుతోంది.

– అన్నా వెంకట రాంబాబు, గిద్దలూరు ఎమ్మెల్యే

చట్టానికి ఎవరూ అతీతులు కాదు



చట్టానికి ఎవరూ అతీతులు కాదు. తప్పు చేసిన వారు ఎవరైనా సరే తప్పించుకోలేరు. చంద్రబాబు పాపం పండింది. స్కిల్ స్కాంలో షెల్ కంపెనీల పేరుతో రూ.370 కోట్ల రాష్ట్ర ప్రజల సొమ్మును చంద్రబాబు దోచుకున్నాడు. అమరావతి పేరుతో భారీ దోపిడీకి పాల్పడ్డారు. గత చంద్రబాబు పాలనలో అన్నీ కుంభకోణాలే. ప్రస్తుత ప్రభుత్వం ధర్మాన్ని కాపాడే బాధ్యత తీసుకుంది. చంద్రబాబు అహంకారానికి కోర్టు తీర్పు చెంప పెట్టు లాంటిది. న్యాయం, ధర్మం గెలిచింది.

– బుర్రా మధుసూదన్ యాదవ్, కనిగిరి ఎమ్మెల్యే

విర్రవీగాడు..అడ్డంగా దొరికాడు



నిరుద్యోగ యువత కోసం స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం రూపొందించి చివరికి నిరుద్యోగులకు లబ్ధి చేకూరకుండా తనకు, తన కుమారుడికి లబ్ధి చేకూర్చుకున్న అవినీతిపరుడు చంద్రబాబు నాయుడికి సంకెళ్లు పడటం శుభపరిణామం. చట్టం దృష్టిలో ఎవరూ అతీతులు కారు. చంద్రబాబు చేసిన అవినీతికి కోర్టులో శిక్ష పడితే అది వైఎస్సార్ సీపీ వారి కక్ష పూరిత చర్య అనటం దారుణం. సీఐడీ అధికారులు స్పష్టమైన ఆధారాలతోనే అరెస్టు చేసి జైలుకు పంపారు.

– వరికూటి అశోక్‌బాబు, వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి

యువత సొమ్ము మెక్కేశారు



స్కిల్ డెవలప్‌మెంట్‌లో కోట్ల రూపాయలు యువత సొమ్మును చంద్రబాబు నాయుడు, కొంత మంది అనుచరులు పందికొక్కుల్లా మెక్కేశారు. ఇందులో చంద్రబాబుతో పాటు తన కుమారుడు లోకేశ్ బాబు కూడా ఇన్వాల్వ్ అయి ఉన్నారు. చంద్రబాబు నాయుడు అవినీతిపరుడని కోర్టు నిర్ధారించింది. చట్టం దృష్టిలో అందరూ సమానులే.

– జూపూడి ప్రభాకర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర సామాజిక న్యాయ సలహాదారుడు

అంబేడ్కర్ కాంస్య విగ్రహ ఏర్పాటు అభినందనీయం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

కొత్తపట్నం: అతి చిన్న పంచాయతీలో అంత పెద్ద ఖర్చుతో బాబా సాహెబ్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ప్రతిష్టించడం అభినందనీయమని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కొనియాడారు. మండలంలోని సంకువారిగుంట గ్రామంలో డాక్టర్ అంబేడ్కర్ అభ్యుదయ యువజన సంఘం, గ్రామ ఉద్యోగస్తులు, గ్రామ ప్రజల సహకారంతో వారి ఆధ్వర్యంలో భారత రత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహ ఆవిష్కరణ మహోత్సవం ఆదివారం బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర సామాజిక న్యాయ సలహాదారుడు జూపూడి ప్రభాకర్‌రావు చేతులతో ఆవిష్కరించారు. విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శిలాఫలకం కూడా ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్నారు. కార్యక్రమానికి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ యరమాల మల్లిఖార్జునరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సంకువారిగుంట గ్రామ ప్రజలు ఇందిరాగాంధీ ఉన్నప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలికేవారని, ఇప్పుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి నూరు శాతం మద్దతు పలుకుతున్నారని గుర్తు చేశారు. బీఆర్ అంబేడ్కర్ అంటే తనకు ఎంతో ఇష్టం అన్నారు. మండలంలో అతి చిన్న పంచాయతీలో రూ.22 లక్షల ఖర్చుతో జూపూడి, డాక్టర్ జగదీశ్ కలిసి అంబేడ్కర్ విగ్రహాన్ని బహూకరించడం అభినందనీయమన్నారు. అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న గ్రామస్తులు గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. మారుమూల ప్రాంతం సంకువారిగుంటలో పుట్టిన జూపూడి ప్రభాకర్‌రావుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్సీగా ఇవ్వడం, రాష్ట్ర సామాజిక న్యాయ సలహాదారుడిగా ఇవ్వటం గొప్ప విశేషమన్నారు. సంకువారిగుంట గ్రామానికి బ్రిడ్జి సమస్య ఉందని, దానిని సీఎం చేతులతో శంకుస్థాపన చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. త్వరలోనే గడప గడపకు సంకువారిగుంటలో ప్రారంభిస్తానని చెప్పారు. జూపూడి ప్రభాకర్‌రావు మాట్లాడుతూ సంకువారిగుంట గ్రామం విజ్ఞాన ఖని అని కొనియాడారు. ప్రతి ఇంటిలో ఒక ఉద్యోగి ఉన్నారని చెప్పారు. సంకువారిగుంట రోడ్డు మీద ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం చూసి ప్రతి రోజు ఆయనను గుర్తు చేసుకుని నమస్కారాలు చేసి వెళ్లాలని గ్రామస్తులకు సూచించారు. న్యూరాలజీ విభాగం, ప్రొఫెసర్ డాక్టర్ జగదీశ్ మాట్లాడుతూ బీఆర్ అంబేడ్కర్ వెనుకబడిన కులాల వారికి రిజర్వేషన్ పెట్టారన్నారు. వెనుకబడిన వర్గాల వారు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీలు, ఎమ్మెల్యేలు, ఉద్యోగాలు చేస్తున్నారంటే అంబేడ్కర్ పొందుపర్చిన రాజ్యాంగం వల్లేనని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, ఎంపీడీవో పి.సుజాత, రాష్ట్ర మత్స్యకార వెల్ఫేర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ వాయల సుమతి, కసుకూర్తి సుబ్బరత్నమ్మ, రిటైర్డ్ తహసీల్దార్ అంబటి వందనం, చిటితోటి త్యాగరాజు, కసుకుర్తి వెంకట్రావు, మేడిత భగవాన్, ఎం.రమణారావు, చిటితోటి మురళి, చిటితోటి కిషోర్ పాల్గొన్నారు.



అంబేడ్కర్ కాంస్య విగ్రహం ప్రారంభిస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి, జూపూడి ప్రభాకర్‌రావు



సభలో మాట్లాడుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

రీజినల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డికి
ఘన స్వాగతం



విజయసాయిరెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న శివప్రసాద్‌రెడ్డి



విజయసాయిరెడ్డికి స్వాగతం పలుకుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి, జంకె వెంకటరెడ్డి, బాచిన కృష్ణచైతన్య తదితరులు

ఒంగోలు: రాజ్యసభ ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రకాశం, పల్నాడు, బాపట్ల, నెల్లూరు, తిరుపతి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ వి.విజయసాయిరెడ్డికి ఘనస్వాగతం లభించింది. ఆదివారం రాత్రి ఒంగోలుకు చేరుకున్న ఆయనను స్థానిక జ్యోతిప్లాజా వద్ద మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ శింగరాజు మీనా వెంకట్రావు, శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణ చైతన్య, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి తదితరులు గజమాలతో సత్కరించారు. వారితోపాటు ఏపీ లేబర్ వెల్ఫేర్‌బోర్డు సభ్యుడు పెద్దిపోగు కోటేశ్వరరావు తదితరులు కూడా విజయసాయిరెడ్డిని గజమాలతో ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, వైఎస్సార్‌సీపీ నగర కన్వీనర్ కటారి శంకర్, ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొఠారి రామచంద్రరావు, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మహబూబ్ తదితరులు పాల్గొన్నారు. ఈనెల 11, 12 తేదీల్లో రెండు రోజులపాటు ఆయన ఒంగోలులోనే ఉంటారు.

ప్రతి సచివాలయం పరిధిలో డిజిటల్ లైబ్రరీ



కంభంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో మాట్లాడుతున్న పంచాయతీరాజ్ శాఖ చీఫ్ ఇంజినీర్

బేస్తవారిపేట: రాష్ట్రంలో ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో ఒక డిజిటల్ లైబ్రరీని ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ ఇంజినీరింగ్ చీఫ్ బాలూ నాయక్ అన్నారు. బేస్తవారిపేటలోని ఆర్‌బీకే భవనాన్ని ఆదివారం పరిశీలించారు. డిజిటల్ గ్రంథాలయాల నిర్మాణానికి స్థలాన్ని ఏర్పాటు చేసుకోవాలని పంచాయతీరాజ్‌శాఖ సిబ్బందికి సూచించారు. రాష్ట్రంలో 9651 గ్రామ సచివాలయాలకుగాను 5356 పూర్తి చేశారన్నారు. 7446 ఆర్‌బీకేలకు 3997 పూర్తయినట్లు తెలిపారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు 1927 నిర్మాణ పనులు పూర్తి చేశారన్నారు. మిగిలిన సచివాలయాలు, ఆర్‌బీకేలు, విలేజ్ హెల్త్ క్లినిక్, బీఎంసీయూలు అక్టోబర్ నెల 30వ తేదీలోపు తప్పనిసరిగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటారన్నారు. సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సమీక్ష నిర్వహించారు. సకాలంలో, నాణ్యతతో పనులు చేయించాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ వై రమేష్‌బాబు, డీఈఈ బీ వరప్రసాదరావు, ఏఈ బీ శ్రీనివాసనాయక్ పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలి

కంభం: పెండింగ్‌లో ఉన్న సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా చూడాలని పంచాయతీరాజ్ శాఖ చీఫ్ ఇంజినీర్ బాలు నాయక్ అన్నారు. నూతనంగా నిర్మిస్తున్న కందులాపురం-2 సచివాలయాన్ని ఆదివారం ఉదయం ఆయన సందర్శించారు. నిర్మాణం చివరి దశలో ఉన్న సచివాలయ భవనాన్ని పరిశీలించిన ఆయన కాంట్రాక్టర్‌ను అభినందించారు. మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేసి ఈనెలలో ప్రారంభించేలా చూడాలని సూచించారు. అనంతరం మండలంలోని సచివాలయాల్లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో మాట్లాడి నిర్మాణాల స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. కందులాపురం సర్పంచ్ బత్తుల తిరుపాలమ్మ (రజని) చీఫ్ ఇంజినీర్‌ను, పంచాయతీరాజ్ అధికారులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ రమేష్ బాబు, డీఈఈ ప్రసాదరావు, పంచాయతీరాజ్ ఏఈ ఆంజనేయరెడ్డి, కాంట్రాక్టర్ బత్తుల సూర్యప్రకాష్, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

చట్టంపై సామాన్యునికి నమ్మకం పెరిగింది

- తప్పుచేశారని సీఐడీ అరెస్టు చేసింది... చేయలేదని చంద్రబాబు నిరూపించుకోవాలి
- అరెస్టు కాకుండా ఉండడానికి చంద్రబాబు ఏమీ మానవతీతుడు కాదు
- సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

ఒంగోలు: అక్రమానికి పాల్పడిన మాజీ సీఎం చంద్రబాబును అరెస్టు చేయడం ద్వారా సామాన్యునికి చట్టంపై నమ్మకం పెరిగిందని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాధనం పక్కదారి పట్టడంపై సీఐడీ చంద్రబాబును అరెస్టు చేసిందని, చంద్రబాబు నిప్పు అయితే కోర్టులో నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. చంద్రబాబును అరెస్టు చేయడంపై రాష్ట్రంలో ఎక్కడా ఎటువంటి అలజడి లేకపోవడంతో టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు జనాలను, మహిళలను పెద్ద ఎత్తున తరలించి పోలీసులను అడ్డుకోవాలంటూ ఆదేశాలు జారీచేస్తూ లీక్ అయిన ఆడియోను బట్టి అచ్చెన్నాయుడుకు శరీరం పెరిగింది కానీ బుద్ధి పెరగలేదన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా, 15 ఏళ్లు ప్రతిపక్ష నేతగా పనిచేసిన చంద్రబాబుకు జైలు భయం పట్టుకుందని, ఆయనేమీ మానవతీత శక్తుడు కాదన్నారు. ఇప్పటికే 17 కేసుల్లో స్టేలు తెచ్చుకున్న చంద్రబాబు కోర్టుల్లో తన నిజాయితీని నిరూపించేందుకు ఎందుకు జంకుతున్నారంటూ ప్రశ్నించారు. జయలలిత, కరుణానిధి, లల్లూ ప్రసాద్ యాదవ్, చిదంబరం, అమిత్‌షా వంటివారు జైలుకు వెళ్లి తమ నిజాయితీని నిరూపించుకునే యత్నం చేశారన్నారు. వారికంటే చంద్రబాబు ఏమీ అతీతుడు కాదని, టీడీపీ నేతలు అనవసరంగా ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో ఉద్రిక్తతలు సృష్టించాలనే యత్నాలు మానుకోవాలని హితవు పలికారు. రూ.371 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం అయినందుకు చంద్రబాబును బాధ్యునిగా గుర్తించి సీఐడీ అరెస్టు చేస్తే బాబును ప్రశ్నించాల్సిన పవన్ కళ్యాణ్ అందుకు భిన్నంగా ప్రభుత్వాన్ని తప్పుబట్టడం దారుణం అని, దీని ద్వారా పవన్‌కళ్యాణ్ పార్టీని ఎవరి కోసం , ఎందుకోసం పెట్టారో అర్థం చేసుకోవాలన్నారు. తొలిసారిగా చంద్రబాబు ముద్దాయిగా కోర్టుకు హాజరయ్యారని, ఇందుకు సీఐడీ చర్యలను అభినందించాల్సి ఉందన్నారు. ఈ కేసులో లోకేష్ పాత్ర కూడా ఉందని తప్పకుండా ఆయనను కూడా విచారించి అరెస్టు చేయాలంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు టీజేఆర్ సుధాకర్ బాబు పేర్కొన్నారు.

క్లుప్తంగా

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు



బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలతో నిర్వాహకులు

ఒంగోలు: స్థానిక లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహిస్తున్న అండర్–13 బాలబాలికల రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. రాష్ట్రవ్యాప్తంగా 231 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. బాలికల సింగిల్స్ విజేతగా అనంతపురానికి చెందిన డి.వి.యజ్ఞశ్రీ, ద్వితీయ స్థానంలో తూర్పుగోదావరి జిల్లాకు చెందిన దీపాటి త్రిష్ణ నిలిచారు. బాలుర సింగిల్స్‌లో డి.వి.యజ్ఞనాథ్ (అనంతపురం), కె.చద్విక్ (విశాఖ) మొదటి రెండు స్థానాలను కైవసం చేసుకున్నారు. బాలికల డబుల్స్‌లో అనంతపురానికి చెందిన డి.వి.యజ్ఞ–నెల్లూరుకు చెందిన శ్లోరెడ్డి ప్రథమస్థానంలో నిలిచారు. తూర్పుగోదావరికి చెందిన డి.విజయ తేజస్విని–విశాఖకు చెందిన పి.వేదిక రన్నర్స్‌గా నిలిచారు. బాలుర డబుల్స్ విభాగంలో అనంతపురానికి చెందిన డి.వి.యజ్ఞనాథ్–చిత్తూరుకు చెందిన ఆముదాల ప్రవీణ్ విన్నర్స్‌గా, విశాఖకు చెందిన కె.చద్విక్–కర్నూలుకు చెందిన మహంకాళి జస్వంత్ రన్నర్స్‌గా నిలిచారు. ముగింపు వేడుకలకు కెనరా బ్యాంక్ డివిజనల్ మేనేజర్ శ్రీనివాసరావు, డీసీబీ బ్యాంక్ మేనేజర్ ఫణికుమార్, కరూర్ వైశ్యా బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్ హాజరై విజేతలకు మెమొంటోలు అందించారు. కార్యక్రమంలో లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి మురళీకృష్ణ, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జేఎస్ లక్ష్మణ్‌రెడ్డి, పి.విజయకృష్ణ, కోశాధికారి అశోక్‌రెడ్డి, రఘుబాబు, సభ్యులు టీవీ రమణ, ఈసీ సభ్యులు కోడె శ్రీనివాస్, రఘుబాబు పాల్గొన్నారు.

రామకూరు కొండపై బాలుడు మృతి



బాలుడి మృతదేహం

జే పంగులూరు: ప్రమాదవశాత్తూ కోనేరులో పడి బాలుడు మృతిచెందిన సంఘటన జే పంగులూరు మండలంలోని రామకూరు గ్రామంలో గల కొండపై ఉన్న రామలింగేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో శనివారం జరగ్గా ఆదివారం వెలుగులోకి వచ్చింది. స్థానిక ఎస్సై కేకే తిరుపతిరావు తెలిపిన వివరాల ప్రకారం.. చీరాల ప్రాంతానికి చెందిన దామర్ల రామకృష్ణ తన కుమారుడు సాయిఅఖిల్ (10), కూతురు అనుశ్రీతో కలిసి రామకూరు గ్రామంలోని కొండపై ఉన్న రామలింగేశ్వరస్వామి దర్శనానికి శనివారం వచ్చారు. మధ్యాహ్న సమయంలో కొండపై గల కోనేరులో గ్రామంలోని కొంతమంది చిన్నారులతో కలిసి సాయి అఖిల్ ఈత కొట్టాడు. సాయంత్ర సమయంలో గుడి ఎదురుగా కూల్‌డ్రింక్ తాగి తన తండ్రి చెప్పినా వినకుండా కోనేరులో దిగాడు. నీటిలో బండపై ఉన్న పాచి మీద కాలు పెట్టేసరికి జారి కోనేరులో పడిపోయాడు. కుమారుడిని కాపాడదామని తండ్రి కోనేరులో దిగేసరికి ఆ ప్రాంతంలో లోతు ఎక్కువగా ఉండటంతో లోపలికి వెళ్లలేకపోయాడు. చేసేది లేక వెనుదిరిగి తన ఊరికి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులకు జరిగిన విషయం తెలియజేసి ఆదివారం రేణింగవరం పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బాలుడి మృతదేహాన్ని బయటకు తీసి వివరాలు సేకరించారు.

ముగిసిన రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలు

చీరాల రూరల్: రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో బాపట్ల జిల్లా బాలికలు, బాలుర జట్లు విజయకేతనం ఎగురవేసినట్లు ఆ జిల్లా షూటింగ్ బాల్ అధ్యక్షుడు డాక్టర్ ఇస్తర్ల బాబూరావు తెలిపారు. నెల్లూరు జిల్లా కావలి పట్టణంలో ఆదివారం షూటింగ్ బాల్ మెన్ అండ్ ఉమెన్ పోటీలు నిర్వహించారు. రాష్ట్రంలోని 16 జిల్లాల జట్లు పాల్గొనగా, బాపట్ల జిల్లాకు చెందిన బాలికల జట్టు ద్వితీయ స్థానం, బాలుర జట్టు నాలుగో స్థానాన్ని కైవసం చేసుకుంది.

ఉపకార వేతనం..
అందిపుచ్చుకో నేస్తం

- ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం
- ఈ నెల 19 చివరి తేదీ



గతంలో ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన పుల్లలచెరువు జెడ్పీ స్కూల్ విద్యార్థులు (ఫైల్)

పుల్లలచెరువు: ప్రతిభావంతులైన విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదివే విద్యార్థులకు జాతీయ స్థాయిలో పోటీ పరీక్షలు నిర్వహించి అందులో ప్రతిభ చూపిన వారికి నాలుగేళ్లపాటు ఉపకార వేతనం అందిస్తారు. ఈ పరీక్షలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 19వ తేదీ వరకు గడువు విధించారు.

ఎవరు అర్హులు...

2023–24 విద్యా సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా పరిషత్, నగరపాలక, పురపాలక సంఘాలు, ఎయిడెడ్, ఆదర్శ, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసేందుకు అర్హులు. ఏడో తరగతి పరీక్షల్లో జనరల్ కేటగిరి, వెనుకబడిన వర్గాలకు చెందిన వారు 55 శాతం, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 50 శాతం మార్కులు సాధించి ఉండాలి. తుది ఎంపిక సమయానికి కచ్చితంగా ఎనిమిదో తరగతిలోనూ 55 శాతానికిపైగా మార్కులు పొందాలి.

రెండు విభాగాలుగా ప్రశ్నపత్రం...

ఏడు, ఎనిమిదో తరగతి పాఠ్యాంశాల ఆధారంగా తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల్లో రెండు విభాగాలుగా ప్రశ్నపత్రం ఉంటుంది. మొదటి విభాగంలో మానసిక, రెండో విభాగంలో విషయ సామర్థ్యంపై ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో విభాగంలో 90 చొప్పున మొత్తం 180 ప్రశ్నలుంటాయి. పరీక్ష రాసేందుకు మూడు గంటల సమయం ఉంటుంది.

ప్రతిభ ఆధారంగానే ఎంపిక...

పరీక్షల్లో ప్రతిభ చూపిన వారికి తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకు ఏటా రూ.12,000 ఉపకార వేతనం అందిస్తారు. కానీ, తొమ్మిదో తరగతిలో 55 శాతం, పదో తరగతిలో 60 శాతం, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 55 శాతం మార్కులు సాధిస్తేనే ఏటా ఉపకార వేతనం లభిస్తుంది.

పరీక్ష ఫీజు వివరాలు...

ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాసేందుకు ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 ఫీజు చెల్లించి ఈ నెల 19వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ఉన్నత విద్యకు దోహదం :

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్ఎంఎంఎస్ పథకం పేద విద్యార్థుల ఉన్నత విద్యకు ఎంతో దోహదపడుతుంది. మా పాఠశాలలోని విద్యార్థులు ప్రతి ఏటా ఈ పథకానికి ఎంపికవుతున్నారు. ఈ పరీక్షలో ఇప్పటి వరకు 75 మంది ప్రతిభ చూపి ఉపకార వేతనానికి ఎంపికయ్యారు. ఈ పరీక్ష గురించి విద్యార్థులకు తెలియజేశాం. ఈసారి కూడా విద్యార్థులతో దరఖాస్తు చేయించి ప్రత్యేక ఉపాధ్యాయులతో శిక్షణ ఇప్పించేందుకు కృషి చేస్తున్నాం. ఎక్కువ మంది ఎంపికయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

ఉమామహేశ్వరరావు, హెచ్ఎం, జెడ్పీ స్కూల్, పుల్లలచెరువు

అమర జవాన్ల త్యాగాలు మరువలేం



శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు, మార్కాపురం మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ

- గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె



పాల్గొన్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, నాయకులు

మార్కాపురం: దేశ సేవలో అమర జవాన్ల త్యాగాలను మర్చిపోలేమని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి అన్నారు. పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న అమర జవాన్ల స్మారక స్థూపం శంకుస్థాపన కార్యక్రమంలో ఆదివారం వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో సైనికులు చేస్తున్న త్యాగాలు ప్రతిఒక్కరి మనసుల్లో ఉంటాయన్నారు. స్మారక స్థూపం ఏర్పాటు చేయడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శాసనాల సరోజిని, చిన్నయ్య, మాజీ సైనికుల సంఘ నాయకులు హరినారాయణరెడ్డి, ఎస్.రామకృష్ణయ్య, వి.శేషసాయి, నారాయణరెడ్డి, తిరుమలయ్య, పుల్లయ్య, నాగేశ్వరరావు, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలుడిపై లైంగికదాడి

- ఇద్దరు బాలురుపై పోక్సో కేసు నమోదు

పొదిలి రూరల్: బాలుడిపై లైంగికదాడికి పాల్పడటంతో పాటు దాన్ని సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సర్క్యులేట్ చేసిన మరో ఇద్దరు బాలురుపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు పొదిలి ఎస్సై వెంకట సైదులు తెలిపారు. ఆ వివరాల మేరకు... పొదిలి పట్టణానికి చెందిన 14 సంవత్సరాల బాలుడిపై అదే ప్రాంతానికి చెందిన 15, 16 సంవత్సరాల వయసున్న ఇద్దరు బాలురు లైంగిక దాడి చేశారు. వైట్నరు, పంక్చరు వేయడానికి ఉపయోగించే సొల్యూషన్స్ అనే మత్తు పదార్థాలు పీల్చడానికి బానిసలైన ఇద్దరూ కలిసి ఈ నెల 8వ తేదీ పొదిలి పెద్దచెరువుకట్టకు బాలుడిని తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డారు. అంతేగాకుండా దానిని సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి ఇతరులకు సర్క్యులేట్ చేశారు. దీనిపై బాధిత బాలుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్ దర్యాప్తు చేపట్టారు. బాధిత బాలుడిని మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పరీక్షలు చేయించారు. ఆదివారం సాయంత్రం 16 సంవత్సరాల బాలుడిని అతని ఇంటి వద్ద అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద సెల్‌ఫోన్ తీసుకుని ఒంగోలులోని జువైనల్ జస్టిస్ బోర్డులో హాజరుపరిచారు. మరో బాలుడి కోసం గాలిస్తున్నారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్న సీఎం

- రూ.2.60 కోట్లతో మోక్షగుండం–ఖాజీపురం బీటీ రోడ్డును ప్రారంభించిన గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు
- రూ.80 లక్షలతో ఖాజీపురం–కొత్తపేట బీటీ రోడ్డుకు శంకుస్థాపన
- బసినేపల్లె, ఎంపీ చెరువులో సచివాలయం, ఆర్‌బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభోత్సవం



రూ.2.60 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

బేస్తవారిపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. బేస్తవారిపేట మండలంలోని మోక్షగుండంలో ముక్తీశ్వరం నుంచి ఖాజీపురం వరకు రూ.2.60 కోట్లతో నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డును ఆదివారం ఆయన ప్రారంభించారు. ఖాజీపురం చెరువు కట్టపై నుంచి కొత్తపేట వరకు రూ.80 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా ఎంపీ చెరువులో సచివాలయం, ఆర్‌బీకే, బసినేపల్లెలో సచివాలయం, ఆర్‌బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్, బీఎంసీయూ భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యేను వైఎస్సార్ సీపీ నాయకులు శాలువాలు, పూలమాలలతో సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్వరాజ్య స్థాపనలో భాగంగా గ్రామస్థాయిలోనే సమస్యల పరిష్కారం కోసం సచివాలయ వ్యవస్థను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా అనేక సంక్షేమ పథకాలను ఏపీలో ప్రవేశపెట్టారన్నారు. కులమతాలకు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతిఒక్క హామీ నెరవేర్చడంతో.. జగనన్న చెప్పాడంటే చేస్తాడనే నమ్మకం ప్రజల్లో గట్టిగా ఏర్పడిందన్నారు. జగనన్న ముందు చూపు ఏపీని అభివృద్ధి పథంలో నడిపిస్తోందన్నారు. నాలుగున్నర ఏళ్లపాలనలో ఎటువంటి అవినీతికి తావులేకుండా ఉత్తమ పాలనను సీఎం అందించారని వివరించారు. రాబోయే రోజుల్లో కూడా జగనన్న సంక్షేమ, అభివృద్ధి పాలనను ఆశీర్వదించాలని కోరారు. టీడీపీ పాలనంతా అవినీతిమయమని, జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ ఇంజినీరింగ్ చీఫ్ బాలూనాయక్, ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, జెడ్పీటీసీ బీవీ రాజయ్య, తహసీల్దార్ డీవీబీ వరకుమార్, ఎంపీడీఓటీ పార్వతి, మార్కాపురం పంచాయతీరాజ్‌శాఖ ఈఈ వై.రమేష్‌బాబు, డీఈఈ బీ వరప్రసాదరావు, ఏఈ శ్రీనివాసనాయక్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన క్రీడోత్సాహం



శాక్ రేస్‌లో పోటీపడుతున్న విద్యార్థులు



స్కిప్పింగ్ పోటీలో పాల్గొన్న బాలికలు



స్లో సైక్లింగ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

- జేసీ వారోత్సవాల్లో భాగంగా ఆకట్టుకున్న క్రీడా పండుగ
- పెద్ద ఎత్తున పాల్గొన్న విద్యార్థులు
- ప్రతి విభాగంలోనూ నలుగురు విజేతల ఎంపిక
- ముగింపు రోజు బహుమతులు పంపిణీ చేస్తామన్న నిర్వాహకులు

ఒంగోలు: జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ వారోత్సవాల్లో భాగంగా రెండోరోజైన ఆదివారం క్రీడా పండుగ ఉత్సాహంగా సాగింది. స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జేసీఐ ఒంగోలు అధ్యక్షులు రామాంజనేయులు, వారోత్సవాల అధ్యక్షులు జాహ్నవి జనార్దన్, విజేత రమణ, ఆత్మీయ బ్రహ్మయ్య, అపెక్స్ శివకోటిరెడ్డి, జేసీ గేమ్స్ కో ఆర్డినేటర్ సోమినేని సురేష్ ఆధ్వర్యంలో ఆహ్లాదకర వాతావరణంలో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు, జాహ్నవి జనార్దన్ మాట్లాడుతూ క్రీడలు ఉల్లాసానికి ప్రతీక అని, తాము నిర్వహిస్తున్న క్రీడల్లో పాల్గొనేందుకు పెద్ద ఎత్తున విద్యార్థులు, క్రీడాకారులు రావడం ఆనందంగా ఉందని అన్నారు. ప్రతి ఏటా నిర్వహించే జేసీస్ వారోత్సవాలకు నగర పౌరుల నుంచి మంచి స్పందన లభిస్తోందని, ఈ ఏడాది కూడా అదే మాదిరిగా కార్యక్రమాలను వీక్షించి చిన్నారులను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. గేమ్స్ కో ఆర్డినేటర్ సోమినేని సురేష్ మాట్లాడుతూ షాట్‌పుట్, స్లో సైక్లింగ్, వందమీటర్ల పరుగు పందెం, స్కిప్పింగ్, శాక్ రేస్, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. విజేతల వివరాలను వెల్లడించారు.

మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన విజేతల వివరాలు...

షాట్‌పుట్ : బి.మురళి (అపెక్స్ స్కూల్), ఎం.పూర్ణ, వై.హేమంత్ (నేతాజీ స్కూల్, ఇనమనమెళ్లూరు), డి.రాము (అపెక్స్)
స్లో సైక్లింగ్ : బీవీ హరికిషోర్ (మాంటిస్సోరి), వై.ధనుష్, సీహెచ్ వినయ్, పి.హేమంత్ (అపెక్స్)
వందమీటర్ల పరుగు (జూనియర్స్) : డి.నరేంద్ర (నారాయణ), జి.రాజేష్ (శ్రీరామ్ కాన్సెప్ట్), ఎస్.కౌషిక్ (ఆంధ్రా), ఎం.సలామ్‌రాజ్ (అపెక్స్)
వందమీటర్ల పరుగు (సీనియర్స్) : కె.కార్తీక్, కె.నాగసుకుమార్ (అపెక్స్), వి.మనోజ్ (డ్రీమ్స్), వై.కార్తీక్ (అపెక్స్)
స్కిప్పింగ్ : ప్రహల్యారెడ్డి (అపెక్స్), ఆర్.లిఖిత (ఇనమనమెళ్లూరు నేతాజీ), నాగజ్యోతి (అపెక్స్), జ్యోతిర్మయి (డ్రీమ్స్), టి.యశస్వి (మాంటిస్సోరి)
శాక్ రేస్ జూనియర్స్ : నిహంత్ (ఆంధ్రా), డి.నరేంద్ర (నారాయణ), రాజశేఖర్ (మాంటిస్సోరి), పి.భవదీప్ (అపెక్స్)
శాక్ రేస్ సీనియర్స్ : వి.మనోజ్‌కుమార్ (డ్రీమ్స్), శివశంకర్ (నేతాజీ), వై.సంతోష్‌రెడ్డి, నాగసుకుమార్ కె (అపెక్స్)
లెమన్ అండ్ స్పూన్ : ఎం.గాయత్రి (అపెక్స్), ఎ.సంజన (ఆంధ్రా), రేవతి, హాసిని (అపెక్స్)
మ్యూజికల్ చైర్స్ జూనియర్స్ : రేవతి, ప్రహల్యారెడ్డి (అపెక్స్), యక్షిత (శ్రీరామ్ కాన్సెప్ట్), బి.అక్షయ–షేక్ ముబీన్
మ్యూజికల్ చైర్స్ సీనియర్స్ : పవిత్ర (మాంటిస్సోరి), ఎస్.కార్తికాంజలి (నేతాజీ), రాజారమణి (ఆంధ్రా), కె.హాసిని (అపెక్స్)–ఆర్.వైష్ణవి (నేతాజీ)

శిద్దా సుధీర్‌కు ఆర్యవైశ్య సంఘాల సత్కారం



శిద్దా సుధీర్‌కుమార్, శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతిని సన్మానించి వేద ఆశీర్వచనం అందిస్తున్న దృశ్యం

ఒంగోలు: తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యుడు శిద్దా సుధీర్‌కుమార్‌ను ఆర్యవైశ్య సంఘాల నేతలు ఆదివారం ఘనంగా సత్కరించారు. స్థానిక జిల్లా వైశ్యభవన్‌లో ఆర్యవైశ్య సంఘ జిల్లా అధ్యక్షుడు రావూరి కాశీరంగ జనార్దన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో శిద్దా సుధీర్‌కుమార్, అతని తల్లిదండ్రులు శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతిలకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వాసవీ మాతకు పూజలు నిర్వహించిన అనంతరం సుధీర్‌కుమార్ మాట్లాడుతూ తిరుమల శ్రీవారికి సేవ చేసుకునే అవకాశం లభించడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఎంతోమంది ఇటువంటి సేవ చేసేందుకు తపిస్తుంటారని, కానీ, తనకు ఆ అదృష్టం చిన్న వయసులోనే లభించడం సంతోషంగా ఉందని అన్నారు. అందుకు కారణమైన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు ప్రకటించారు. తన తండ్రి బాటలో పయనించి మంచి పేరు తెచ్చుకుంటానని చెప్పారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు శిద్దా రాఘవరావు మాట్లాడుతూ తన కుమారుడు సుధీర్‌కు పెద్ద ఎత్తున ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసిన ఆర్యవైశ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఆర్యవైశ్యులు అంటే తమ కుటుంబ సభ్యులని అన్నారు. వారికి ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తమ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఆర్యవైశ్య మహిళా సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు శిద్దా లక్ష్మీపద్మావతి మాట్లాడుతూ తమ కుటుంబం పట్ల జిల్లాలో, రాష్ట్రంలో ఉన్న ఆర్యవైశ్య కుటుంబ సభ్యులంతా కనబరుస్తున్న ప్రేమాభిమానాలు చిరకాలం తమ హృదయంలో పదిలంగా ఉంటాయన్నారు. అనంతరం వేదపండితులు సుధీర్‌కుమార్‌కు వేద ఆశీర్వచనం అందించగా, వెండి కిరీటంతో సత్కరించారు. శిద్దా రాఘవరావు దంపతులను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో వాసవీ సత్ర సముదాయాల అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, ఆర్యవైశ్య సంఘ మాజీ అధ్యక్షుడు శిద్దా సూర్యప్రకాశరావు, మార్కాపురం మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, కార్యదర్శి జలదంకి కృష్ణారావు, కోశాధికారి కొత్తూరు రంగనాయకులు, వాసవీ సత్రాల సముదాయాల గౌరవాధ్యక్షులు శిద్దా నాగేశ్వరరావు, కొత్తూరి రంగనాయకులు, కొణిజేటి సురేష్, దేవతు రాజా, ఇమ్మిడిశెట్టి సత్యనారాయణ, ఆర్యవైశ్య మహిళా విభాగం నాయకురాలు లక్ష్మీమోహన్, సూరే ఉమాదేవి, రావిపూడి లక్ష్మీనారాయణ, చలువాది బదరీ నారాయణ, డాక్టర్ చావల ప్రకాష్, సూరే చిన సుబ్బారావు, చందోలు మణికంఠ, బొగ్గవరపు సుబ్బారావు, అమృత ప్రకాష్, కొల్ల భాస్కర్, మోదుకూరి వెంకటేశ్వర్లు, చక్కా వెంకట కేశవరావు, ఉమ్మడి ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘ కార్యవర్గ సభ్యులు, వాసవీ సేవాదళ్ నాయకులు చీదెళ్ల వేణుగోపాల్, కోళ్లపూడి బ్రహ్మయ్య, బాదం వెంకట కళ్యాణ్, ఆర్యవైశ్య యువజన సంఘ నాయకులు, ఆర్యవైశ్య వాసవీ మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.